క్లుప్తంగా

నేటి నుంచి నరహరిపేటలో బస్ స్టాపింగ్

గుడిపాల: మండలంలోని నరహరిపేటలో ఆదివారం నుంచి ఆర్టీసీ బస్సులు ఆగనున్నాయి. గుడిపాల మండల కేంద్రంలోనే బస్సులు ఆపుతున్నారని.. నరహరిపేట పోలీస్‌స్టేషన్ వద్ద బస్సులు ఆపడం లేదని ఇటీవల స్థానికులు ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన రీజినల్ మేనేజర్‌తో మాట్లాడారు. ఆదివారం నుంచి చిత్తూరు రెండో డిపో బస్సులు నరహరిపేటలో ఆగేలా చర్యలు తీసుకున్నారు.

పేదలకు మెరుగైన వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పేదలకు ఇంటి వద్దనే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. శనివారం మండలంలోని గుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 80 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్తంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అవసరమైన వారిని చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగులో ఉన్న ప్రతి పంట నమోదు చేయాలి


పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ

గుడిపాల: ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పంటను నమోదు చేయాలని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మధుసుదన్‌రెడ్డి అన్నారు. శనివారం గొల్లపల్లె, 197రామాపురం గ్రామంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. గ్రామ మ్యాప్‌లో సర్వే నంబర్లను గుర్తించి నమోదు చేయాలన్నారు. పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా 1బి, ఆధార్‌కార్డ్ తీసుకెళ్లి గ్రామంలోని రైతు భరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలన్నారు.

నేడు జానపద గీతాలాపన

చిత్తూరు రూరల్: ఈనెల 22న ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని రెవెన్యూ భవనంలో ఆదివారం మన సంస్కృతి కళా సంస్థ తిరుపతి వారి ఆధ్వర్యంలో జానపద గీతాలాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సహదేవనాయుడు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు పాల్గొనవచ్చని తెలిపారు.

మార్కెట్‌లోకి ఈ బైక్ ఐక్యూబ్


కొనుగోలుదారులకు ఈబైక్‌ను అందజేస్తున్న ప్రతినిధులు

చిత్తూరు రూరల్: నగరంలోని టీవీఎస్ కంపెనీ షోరూంలో శనివారం ఎలక్ట్రానిక్ టూవీలర్ బైక్ ఐ క్యూబ్‌ను విడుదల చేశారు. టీవీఎస్ కంపెనీ ప్రతినిధి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ వాహనం ఒక్కసారి చార్జ్ చేసే 100 కి.మీ ప్రయాణించవచ్చన్నారు. అనంతరం కొనుగోలుదారులకు బైక్‌కు అందజేశారు. షోరూం నిర్వాహకులు భక్తవత్సలం, సురేష్, కుమార్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌తో రైతుకు చేయూత

- అధిక విస్తీర్ణంలో వేరుశనగ, వరి
- ప్రారంభమైన ఈ-క్రాప్ నమోదు
- వందశాతం పూర్తి చేయాలని లక్ష్యం


ఈ క్రాప్‌బుకింగ్ చేస్తున్న సిబ్బంది

చిత్తూరు రూరల్: ఈ క్రాప్ నమోదుతో ప్రభుత్వం రైతుకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రా(ఆర్‌బీకే)లు ఏర్పాటు చేసి విత్తనం మొదలుకుని పంట దిగుబడి చేతికొచ్చే వరకు అన్ని రకాల సేవలందిస్తోంది. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించాలనే లక్ష్యంతో ఈ క్రాప్ ఆరంభించింది. పథకాల అమలులో పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా రైతులు ఏయే పంటలు సాగు చేశారు. ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను వ్యవసాయ అధికారులు ఈ క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. శుక్రవారం నుంచి ఈ-పంట నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. వందశాతం పంట నమోదు లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు.

చిత్తూరు డివిజన్‌లోని 10 మండలాల పరిధిలో 165 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 29,546 ఎకరాల్లో సాధారణ సాగు భూమి ఉంది. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు 13,352 ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేశారు. ఇందులో 547 ఎకరాల్లో వరి, 145.7 ఎకరాల్లో రాగి, 104 ఎకరాల్లో ఉలవలు, 431 ఎకరాల్లో కందులు, 5,871 ఎకరాల్లో వేరుశనగ, 3931 ఎకరాలో చెరకు, 1973 ఎకరాల్లో పశుగ్రాసం, 194 ఎకరాల్లో జనుము, జీలుగ, కూరగాయలు, ఇతర రకాల పంటలు వందల ఎకరాల్లో సాగైంది. హార్టికల్చర్ కింద మామిడి 18 వేల హెక్టార్లలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో ఏయే పంటలు ఎంతమేర సాగయ్యాయనే వివరాలను రైతు భరోసా కేంద్రం అసిస్టెంట్లు నేరుగా రైతుల పొలం వద్దకే వెళ్లి ఈ క్రాపులో నమోదు చేస్తున్నారు.

ప్రారంభమైన నమోదు ప్రక్రియ

పంట నమోదు ఈ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభించింది. అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా అసిస్టెంట్లు ఈ పంట నమోదు ప్రక్రియను ప్రారంభించారు. పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రాపు నమోదు కోసం రైతులు ఆధార్, బ్యాంకు ఖాతా, ఫోన్ నంబర్లు, భూమికి సంబంధించిన వివరాలు ఇవ్వాలని చెబుతున్నారు. వీఏఏలు ఆధార్ బేస్ డేటాను అనుసంధానం చేసి ఈ క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నిర్ణీత సమయానికి శతశాతం పూర్తిచేయాలని ఆదేశాలు ఇచ్చారు.

లాభాలు ఇలా..

- పంట నమోదు వల్ల వరదలు, తుపాన్ల సమయంలో పంటలకు ఏదైనా నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ అందుతోంది.
- పంటల బీమా కావాలన్నా, సున్నా వడ్డీకి పంట రుణాలు కావాలన్నా రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు తీసుకోవాలన్నా ఈ క్రాప్‌లో నమోదు తప్పనిసరి
- పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నా ఈ క్రాప్ చేసి ఉండాలి.
- భవిష్యత్‌లో ఈ-పంట నమోదు ఆధారంగా ఎరువులు, విత్తనాలు అందించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.
- రైతు భరోసాకు ఈ పంట నమోదు అవసరం.
- కౌలు రైతులు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు తమ వివరాలు అందజేసి పంట నమోదు చేసుకోవచ్చు.

ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి



రైతులందరూ ఈ క్రాప్ నమోదు చేయించుకుంటే ప్రభుత్వ ప్రయోజనాలకు అర్హత లభిస్తుంది. పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. దీని వల్ల కలిగే లాభాలను రైతులు గుర్తించాలి. విధిగా పంట నమోదును చేయించుకోవాలి. వరదలు, తుపాన్లు వచ్చి పంట నష్టపోయిన సమయంలో ఈ క్రాప్ చేయించుకుని ఉంటే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుంది. ఇతర ప్రభుత్వ పథకాలకు ఇది ఉపయోగకరం.

–మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయశాఖ ఏడీ, చిత్తూరు

108లో సుఖ ప్రసవం


తల్లిబిడ్డ

చిత్తూరు రూరల్/గుడిపాల: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణికి 108 సిబ్బంది సుఖప్రసవం చేయడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలు.. గుడిపాల మండలం వెంగమాంబపురం గ్రామానికి చెందిన మహేశ్వరికి శనివారం సాయంత్రం పురిటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్‌లో ఆమెను చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా చిత్తూరు మండలం పిల్లారిమిట్ట గ్రామం వద్ద నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎంటీ ఆనందన్ పైలెట్ లోకేష్ సాయంతో ప్రసవం చేశారు. దీంతో గర్భిణి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. క్లిష్టతర పరిస్థితుల్లో ఆమెకు డెలివరీ చేశామని సిబ్బంది తెలిపారు. కాగా ప్రైవేట్ ఆస్పత్రిలో చూపిస్తే ఆపరేషన్ చేయాలని చెప్పారని మహేశ్వరి భర్త విల్సన్ తెలిపారు. సుఖ ప్రసవం చేసిన 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తల్లిబిడ్డను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు


ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు

తవణంపల్లె: నియోజకవర్గంలోని ప్రజా సమస్యలు పరిష్కరించడానికే గడపకు గడపకు వస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తవణంపల్లె మండలం గురుకువారిపల్లె పంచాయతీ పరిధిలోని జి. గొల్లపల్లె, జి.గొల్లపల్లె దళితవాడ, బీసీ కాలనీ, పత్రపల్లె, పత్రపల్లె బీసీ కాలనీలో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే చేరాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు

గురువారిపల్లె పంచాయతీలో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేయాలని, మురుగునీటి కాలువలు నిర్మించాలని, పింఛన్లు, ఇంటి పట్టాలు, పక్కాగృహాలు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బాబు జి.గొల్లపల్లెలో కమ్యూనిటీ భవనం, సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఎగువ మత్యంలో చర్చి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆయన వెంట ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, భూరీసర్వే డీటీ వెంకటరమణ, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ టి.భాను, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, మండల కన్వీనర్ హరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.ప్రకాష్ రెడ్డి, నరోత్తమరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, గురునాథరెడ్డి, గాంధీబాబు, సురేష్‌బాబురెడ్డి, పరమేశ్వర రెడ్డి, మధుకుమార్ పాల్గొన్నారు.

450 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే బాబు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆస్థాన మండపంలో శనివారం బెంగళూరుకు చెందిన కావేరి స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు వైద్య పరీక్షలు చేసుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు సహా మొత్తం 450 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయభాస్కర్, నారాయణమూర్తి, వైద్యులు ఉషా, సౌమ్య, ఆస్పత్రి ఇన్‌చార్జ్ మునీంద్ర, ప్రవీణ్ పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్సీ ఐలా వెంకటేశ్వరరావు

చిత్తూరు కలెక్టరేట్: టీచర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐలా వెంకటేశ్వరరావు కోరారు. శనివారం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో నాయకులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జీఓ నంబర్ 117ను రద్దు చేయాలన్నారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన టీచర్లు, హెచ్‌ఎంలకు వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. ఫ్యాప్టో చైర్మన్ మునాఫ్ మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. టీచర్లకు బోధనేతర పనులను తగ్గించాలని కోరారు. సంఘం నాయకులు హేమాద్రి, గోపీనాథ్, జీవీ రమణ, దేవరాజులురెడ్డి, రమేష్, నరోత్తమరెడ్డి పాల్గొన్నారు.

సర్కారు విద్యార్థుల మేధస్సు అమోఘం


గణిత ప్రజ్ఞాధారణలో పాల్గొన్న మంగళపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

- గణిత ప్రజ్ఞాధారణతో అబ్బురపరిచిన విద్యార్థులు
- ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు రాధాకృష్ణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : గణిత ప్రజ్ఞాధారణతో అబ్బురపరచిన సర్కారు విద్యార్థుల మేధస్సు అమోఘమని ఆంధ్రా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు రాధాకృష్ణారెడ్డి అన్నారు. నగరంలోని విజయం డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞానవేదిక, ఏపీ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బంగారుపాళెం మండలం మంగళపల్లె జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న హేమ, లహరి, రేవతి, పునీత్‌సాయి అనే విద్యార్థులు అవలీలగా గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులతో రాష్ట్రంలోని ఏ పాఠశాలలో నిర్వహించని ఈ కార్యక్రమం అద్భుతమన్నారు. సర్కారు పాఠశాలలో చదివిన విద్యార్థుల మేధస్సుకు మంత్రముగ్ధుడినయ్యానన్నారు. ఎంఈఓ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ప్రతిభ అసాధారణమని తెలపడానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. గణిత అవధాని అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ క్లిష్టసమస్యల సాధనలో గణితం ఒక సాధనం అన్నారు. సమస్యల సాధనలో గణితం ప్రాధాన్యత నేటి ఆధునిక ప్రపంచంలో అత్యంత ఆవశ్యకమని తెలిపారు. అనంతరం పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అమరనాథరెడ్డి, చంద్రమనాయుడు, కళాశాల చైర్మన్ తేజోమూర్తి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

గుడిపాల: మండల పరిధిలోని పాడి పశువులకు ముద్దచర్మ వ్యాధి(లంపీ) నిరోధక టీకాలు వేయించాలని పశువైద్యాధికారి సాయిసుధ అన్నారు. శనివారం వసంతాపురం పంచాయతీలో 200 పశువులకు వ్యాక్సిన్ వేశారు. పాడి పశువులకు చర్మంపై బిల్లల ఆకారంతో బొబ్బలు రావడం, మేత సరిగ్గా తీసుకోకపోవడం వంటివి ఉంటే ముద్దచర్మ వ్యాధి లక్షణాలుగా భావించవచ్చని తెలిపారు. అలాంటి వ్యాధి నుంచి కాపాడుకోవాలంటే తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని తెలిపారు. నాలుగు నెలలు పైబడిన దూడలకు, పశువులకు టీకాలు వేయించాలన్నారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగురవేద్దాం


జెండాలను ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: హర్‌ఘర్ తిరంగాలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు అన్నారు. శనివారం తపాలా కార్యాలయం వద్ద జాతీయ జెండాలను ప్రదర్శించారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు ప్రతి ఒక్కరూ వారి నివాసాలపై జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలన్నారు. ఫ్లాగ్‌తో సెల్ఫీ తీసుకుని hargartiranga.com వెబ్‌సైట్‌లో పోస్టు చేయాలని కోరారు. భాస్కర్, బ్రహ్మానందరెడ్డి, గురు గణేష్, గోకుల్‌యాదవ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రామచంద్రయ్య

చిత్తూరు అర్బన్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి అధికారులు చొరవ చూపాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్ర డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరులోని సీఐటీయూ కార్యాలయంలో కార్మికుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. అవుట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే కార్మికులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. కార్మిక సంఘం నాయకులు సురేష్, గోపినాథ్, మణి, చంద్ర, వాసు, చంద్ర, సుగుణ పాల్గొన్నారు.

మణిపూర్ అల్లర్లపై నిరసన



గుడిపాల: మణిపూర్‌లో మహిళలపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఎస్ఐ నరహరిపేట పాస్టరేట్ బిషప్‌శర్మ నిత్యానందం అన్నారు. శనివారం గుడిపాల మండలంలోని నరహరిపేటలో క్రైస్తవులు నిరసన ర్యాలీ చేపట్టారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని కోరారు. నార్తన్ ఏరియా చైర్మన్ ఇమాన్యువేల్, రెవరెండ్ రాజేష్, పాస్టరేట్ సెక్రటరీ శిలంబరసన్, సత్య పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కోటాలో ట్రిపుల్ ఐటీకి ఐరాల విద్యార్థి


ఉదయ్


హారిక

ఐరాల: స్పోర్ట్స్ కోటాలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఉదయ్ ఎంపికైనట్లు హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 424 మార్కులు సాధించిన ఉదయ్ స్పోర్ట్స్ కోటాలో, అలాగే 566 మార్కులు సాధించిన హారిక ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించారన్నారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా పరిశీలన

గుడిపాల: ఓటర్ల జాబితా పరిశీలన త్వరితగతిన పూర్తిచేయాలని మండల స్పెషలాఫీసర్ మధుసుదన్‌రెడ్డి బీఎల్‌ఓలకు సూచించారు. శనివారం గుడిపాల మండలం 197రామాపురంలో ఓటర్ల జాబితా పరిశీలనను తనిఖీ చేశారు. ఒక కుటుంబంలో ఉన్న ఓటర్లంతా ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈనెల 21లోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.